సాక్షి యాదాద్రి భువనగిరి

గురువారం ı 9 ı ఫిబ్రవరి ı 2023



ముమ్మరంగా ఘాట్ రోడ్డు పనులు
వర్షాలకు కుంగిపోయిన యాదాద్రి మొదటి ఘాట్ రోడ్డు పనులు ముమ్మరంగా సాగుతున్నాయి.
- 8లో



కార్పొరేట్‌కు దీటుగా సేవలు
తుర్కపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కార్పొరేట్‌కు దీటుగా వైద్య సేవలు అందుతున్నాయి.
- 9లో

గరిష్టం/కనిష్టం 34°/17°

వాతావరణం
ఆకాశం ఉదయం పొగమంచుతో మేఘావృతంగా ఉంటుంది. రాత్రిపూట చలి ఎక్కువగా ఉంటుంది.

న్యూస్‌రీల్

రికార్డుల తనిఖీ

భువనగిరి : జెడ్పీ సీఈఓ కృష్ణారెడ్డి బుధవారం భువనగిరి మండల పరిషత్ కార్యాలయాన్ని సందర్శించారు. 2020–21, 2021–22 సంవత్సరాలకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. రికార్డుల నిర్వహణపై అడిగి తెలుసుకున్నారు. అదే విధంగా పల్లె ప్రగతి కార్యక్రమంలో భాగంగా మండలంలో చేపట్టిన అభివృద్ధి పనులపై ఆరా తీశారు. పెండింగ్ పనులను త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ నరేందర్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

పంచ నారసింహుడికి సంప్రదాయ పూజలు



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న ఆచార్యులు

యాదగిరిగుట్ట : యాదాద్రి క్షేత్రంలో బుధవారం సంప్రదాయ పూజలు కొనసాగాయి. వేకువజామున సుప్రభాతం,స్వయంభూలకు బిందె తీర్థం, ఆరాధన చేశారు. అనంతరం బాలభోగం, మూలవర్యులకు నిజాభిషేకం నిర్వహించారు. శ్రీస్వామి వారికి సహస్రనామార్చన, అమ్మవారికి కుంకుమార్చన, నిత్యకల్యాణం తదితర కైంకర్యాలు గావించారు.

ప్రోత్సాహకం డబ్బులు విడుదల చేయాలని వినతి



మంత్రికి వినతిపత్రం అందజేస్తున్న ప్రభుత్వ విప్ సునీత, మదర్ డెయిరీ చైర్మన్ శ్రీకర్‌రెడ్డి

ఆలేరురూరల్ : పాల ఉత్పత్తిదారులకు రావల్సిన ప్రోత్సాహకం డబ్బులు విడుదల చేయాలని కోరుతూ ప్రభుత్వ విప్ గొంగిడి సునీతతో కలిసి మదర్ డెయిరీ చైర్మన్ శ్రీకర్‌రెడ్డి బుధవారం హైదరాబాద్‌లో పశు సంవర్ధక శాఖ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. మంత్రి సానుకూలంగా స్పందిస్తూ బకాయిలు త్వరలో విడుదల చేస్తానని హామీ ఇచ్చినట్లు తెలిపారు.

ఆడ పిల్లల భవిష్యత్‌కు 'సుకన్య సమృద్ధి యోజన'



ఖాతాలు అందజేస్తున్న ఎస్‌పీఎం అమర్‌నాథ్

ఆత్మకూరు(ఎం) : ఆడ పిల్ల బంగారు భవిష్యత్‌కు సుకన్య సమృద్ధి యోజన పథకం ఎంతో దోహదపడుతుందని పోస్టల్ శాఖ ఎస్ పీఎం అమర్‌నాథ్ తెలిపారు. బుధవారం ఆత్మకూర్(ఎం)లో లబ్ధిదారులకు ఖాతాలిచ్చి మాట్లాడారు. అమ్మాయికి 18ఏళ్లు నిండిన తర్వాత జమచేసిన మొత్తంలో ఉన్నత విద్యకోసం 50 శాతం రుణం పొందవచ్చన్నారు. కార్యక్రమంలో పోస్టల్ ఈడీ డీఏలు కృష్ణారెడ్డి, పానగాని జహంగీర్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌కు వీఆర్‌ఎస్ తప్పదు



బీజేపీ డైరీని ఆవిష్కరిస్తున్న సూదగాని హరిశంకర్‌గౌడ్, రాజశేఖర్‌రెడ్డి తదితరులు

మోటకొండూర్ : వచ్చే ఎన్నికల్లో రాష్ట్రంలో ప్రజలు బీఆర్‌ఎస్ పార్టీకి వీఆర్‌ఎస్ ఇచ్చి బీజేపీకి పట్టం కట్టడం ఖాయం అని బీజేపీ రాష్ట్ర నాయకుడు సూదగాని హరిశంకర్‌గౌడ్, శక్తి కేంద్రాల జిల్లా ఇన్‌చార్జ్ కేసిరెడ్డి రాజశేఖర్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. బుధవారం మోటకొండూరులోని బీజేపీ కార్యాలయంలో నిర్వహించిన 'ప్రజాగోస – బీజేపీ భరోసా' స్ట్రీట్ కార్నర్ మీటింగ్ సన్నాహక సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలో కుటుంబ పాలన సాగుతుందని, సీఎం కేసీఆర్ ప్రజా సమస్యలను గాలికొదిలేశారని విమర్శించారు. బడ్జెట్ ప్రజలను మభ్యపెట్టేదిగా ఉందన్నారు. కేంద్రప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని పార్టీ శ్రేణులకు సూచించారు. అనంతరం భారతీయ జనతా పార్టీ తెలంగాణ డైరీని వారు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జోరుక ఎల్లేష్, పన్నాల చంద్రశేఖర్‌రెడ్డి, చిర్ర రవీందర్, యెల్లంల శ్రీధర్‌రెడ్డి, గాజుల ప్రవీణ్‌గౌడ్, యాస కృష్ణారెడ్డి, సురేందర్‌రెడ్డి పాల్గొన్నారు.



లింగమంతుల స్వామి దర్శనం కోసం బారులుదీరిన భక్తులు



పెద్దగట్టు నుంచి దేవరపెట్టెను కేసారం తరలిస్తున్న యాదవులు



బోనం వండుతున్న మున్న, మెంతబోయిన వంశస్తులు

కేసారం చేరిన దేవరపెట్టె

దురాజ్‌పల్లిలోని శ్రీ లింగమంతుల స్వామి (గొల్లగట్టు) జాతరకు నాలుగో రోజు బుధవారం భక్తులు భారీగా తరలివచ్చారు. నెలవారం కార్యక్రమాన్ని మున్న, మెంతబోయిన వంశస్తులు సంప్రదాయ పద్ధతిలో నిర్వహించారు. లింగమంతుల స్వామి, చౌడమ్మ తల్లికి బోనం వండి నైవేద్యంగా సమర్పించారు. అనంతరం దేవరపెట్టెను కేసారం గ్రామానికి తరలించి దేవరగుడిలో పెట్టి పూజలు చేశారు.

–సూర్యాపేట, చివ్వెంల
8లో

పొలాల్లో డీజిల్ వాడకం హానికరం

- ఏరువాక శాస్త్రవేత్తలు డాక్టర్ అనిల్‌కుమార్, మధుశేఖర్

రామన్నపేట : పొలాలకు డీజిల్ వినియోగించడం హానికరమని భువనగిరి ఏరువాక కేంద్రం శాస్త్రవేత్తలు డాక్టర్ అనిల్‌కుమార్, మధుశేఖర్ సూచించారు. బుధవారం మండలంలోని శోభనాద్రిపురం, లక్ష్మాపురంలో వరి చేలను పరిశీలించి కాండం తొలుచు పురుగు ఆశించినట్లు గుర్తించారు. రైతులకు సూచనలు చేశారు. డీజిల్ వాడడంవల్ల పంటలకు మేలు చేకూర్చే మిత్రపురుగులు, వానపాములతోపాటు పలు సూక్ష్మజీవులు చనిపోతాయన్నారు.దీని నివారణకు చిరు పొట్ట దశలో ఎకరాకు కార్టాఫ్ హైడ్రోక్లోరైడ్ 400 గ్రాములు లేదా క్లోరోనాత్రనిలిప్రోల్ 60 మి.లీ పిచికారీ చేయాలన్నారు. సస్యరక్షణ చర్యలు చేపట్టకుంటే తెల్లకంకులు, తాలుగింజలు వస్తాయని తెలిపారు. దోమపోటు, సల్ఫైడ్ ఇంజ్యూరి నివారణకు పొట్టదశలో పొలంలో 5 సెంమీ వరకు నీటిని ఉంచాలని, నాభీయదశలో ఆడపాదడపా నీటిని తీసి ఎండబెట్టాలని సూచించారు. చిరుపొట్ట దశలో 50కిలోల యూరియాకు 15 కిలోల పొటాష్ కలిపి వాడాలన్నారు. వానాకాలం జీలుగ లేదా జనుమువేసి కలియదున్నాలని, వీలైనంత వరకు మాగిన పశువులపేడ, కోళ్లపెంట, వర్మి కంపోస్ట్ వేయాలని, ప్రతీ మూడు పంటలకు ఒకసారి ఎకరాకు 20 కిలోల జింక్ సల్ఫేట్‌ను అడుగు మందులో కలపకుండా దుక్కిలో వేయాలని సూచించారు. వారి వెంట ఏఓ యాదగిరిరావు, ఏఈఓలు వెంకటేష్, కిరణ్, వెంకన్న, శ్రీనివాస్, క్రిష్ణ తదితరులు ఉన్నారు.



వరి చేనును పరిశీలించి రైతులకు సూచనలు చేస్తున్న శాస్త్రవేత్తలు

మాతా, శిశు ఆరోగ్యంపై అశ్రద్ధ వద్దు

- కలెక్టర్ పమేలా సత్పతి

సాక్షి,యాదాద్రి : మాతా, శిశు ఆరోగ్యంపై అశ్రద్ధ చూపవద్దని, నాణ్యమైన వైద్యసేవలు అందించాలని కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. ప్రోగ్రాం ఆఫీసర్లు, వైద్య విధాన పరిషత్ డాక్టర్లు, పీహెచ్‌సీ వైద్యాధికారులతో బుధవారం కలెక్టరేట్‌లో సమీక్ష నిర్వహించారు. మాతా శిశు మరణాలను అరికట్టాలని, గర్భిణులు సాధారణ కాన్పులకు ప్రాధాన్యం ఇచ్చేలా ప్రాథమిక స్థాయి నుంచి వారికి కౌన్సిలింగ్ ఇవ్వాలన్నారు. పీహెచ్‌సీ నుంచి గర్భిణులను వైద్య విధాన పరిషత్ ఆస్పత్రులకు పంపించిన తర్వాత వారికి అందే సేవలపై స్పెషలిస్టు డాక్టర్లు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తుండాలన్నారు. కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు, ఏరియా ఆస్పత్రుల నుంచి ఇతర వైద్యశాలలకు పంపితే అందరి అనుమతితో వైద్యాధికారులకు రెఫర్ చేయాలని ప్రోగ్రాం అధికారులకు సూచించారు. మాతా,శిశు సేవలపై ప్రతి నెలా సమీక్ష నిర్వహిస్తానని, మార్పు రాకుంటే చర్యలు తీసుకుంటామన్నారు. ఏఎన్‌ఎంలు గర్భిణులకు సంబంధించిన రికార్డులను అంగన్‌వాడీ కేంద్రాల్లో నిర్వహించే శుక్రవారం సభలకు తీసుకురావాలన్నారు. ప్రోగ్రాం అధికారులు ప్రతి నెలా సీ సెక్షన్ ఆడిట్, సాధారణ కాన్పులు పెరిగేలా కృషి చేయాలన్నారు. టీబీ వ్యాధిగ్రస్తులను గుర్తించి పూర్తిస్థాయిలో వైద్యం తీసుకునేలా చూడాలన్నారు. ప్రతి ఒక్కరికీ కంటి పరీక్షలు చేసి అవసరమైన వారికి అద్దాలు అందేలా చూడాలన్నారు. హెల్త్ అసిస్టెంట్లు జ్వరపీడితుల రక్త నమూనాలు సేకరించి పీహెచ్‌సీకి పంపించి మలేరియా పరీక్షలు చేయాలన్నారు. ఈ సమావేశంలో డీఎంహెచ్‌ఓ డాక్టర్ మల్లికార్జున్‌రావు, డాక్టర్లు చిన్ననాయక్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

దాతలు ముందుకు రావాలి

భువనగిరిటౌన్ : ప్రజాహిత కార్యక్రమాలకు దాతలు సహకరించాలని కలెక్టర్ పమేలా సత్పతి కోరారు. భువనగిరి మండలం బస్వాపురం ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో ఏడుగురు విద్యార్థులకు ఎన్‌ఆర్‌ఐ వలిగొండ మండలం జంగారెడ్డిపల్లివాసి బుస్సా నాగరాజు మిత్రబృందం సైకిళ్లు సమకూర్చారు. వీటిని బుధవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. దూర ప్రాంతాల నుంచి పాఠశాలకు వచ్చిన చదువుకుంటున్న విద్యార్థుల కోసం సైకిళ్లు అందజేడయం అభినందనీయమన్నారు. విద్యార్థులు సైకిల్ తొక్కడం ద్వారా శారీరక, మానసిక అభివృద్ధి కలుగుతుందన్నారు. తనకు కూడా సైకిల్ తొక్కడం అంటే ఎంతో ఇష్టమని విద్యార్థినులతో తన బాల్యస్మృతులను పంచుకున్నారు. పాఠశాలకు క్రమం తప్పకుండా హాజరుకావాలని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ దీపక్‌తివారీ, డీఈఓ నారాయణరెడ్డి, ఎంపీపీ నరాల నిర్మల, ప్రధానోపాధ్యాయులు శశికుమార్, బుస్సా రమేష్, వెంకటేశ్వర్లు, అంజనికుమార్, జమ్మయ్య పాల్గొన్నారు.



విద్యార్థులకు సైకిళ్లు అందజేస్తున్న కలెక్టర్

యాదాద్రీశుడి సేవలో డీసీసీ అధ్యక్షుడు

యాదగిరిగుట్ట : తన పుట్టిన రోజు సందర్భంగా డీసీసీ అధ్యక్షుడు కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి బుధవారం కుటుంబ సమేతంగా యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహ స్వామిని దర్శించుకున్నారు. గర్భాలయంలో స్వయంభూలకు, ప్రతిష్టా అలంకార మూర్తులకు పూజలు చేశారు. అనంతరం వేద ఆశీర్వచనం, సువర్ణ పుష్పార్చనలో పాల్గొన్నారు. వారికి ఆచార్యులు ఆశీర్వచనం చేశారు. అనిల్ కుమార్‌రెడ్డిని కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు సన్మానించారు.



కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి, కుటుంబ సభ్యులకు వేద ఆశీర్వచనం చేస్తున్న ఆచార్యులు

విస్తరణలో జాప్యం!

నాలుగు నెలలుగా నిలిచిన మోత్కూరు – రాయగిరి రోడ్డు పనులు

- బిల్లులు రాలేదని ఆపేసిన కాంట్రాక్టర్
- అగ్రిమెంట్ గడువు మరో ఆరు నెలలే
- రెండేళ్లు గడిచినా ఒక్క వైపే పూర్తి.. చేసిన పనులూ అస్తవ్యస్తం
- వన్ వేతో తరచూ ప్రమాదాలు
- దుమ్ముతో ఇబ్బంది పడుతున్న జనం





కాటేపల్లి సమీపంలో అసంపూర్తిగా రహదారి, వాహనాలు వెళ్లేటప్పుడు దుమ్ము లేస్తున్న రోడ్డు

ఆత్మకూరు(ఎం), మోటకొండూరు : మోత్కూరు – రాయగిరి రహదారి విస్తరణ పనులు నత్తనడకన సాగుతున్నాయి. కాంట్రాక్టర్ నిర్లక్ష్యం, అధికారులు సైతం దృష్టిసారించకపోవడంతో పనుల్లో తీవ్ర జాప్యం చోటు చేసుకుంటోంది. పనులు ప్రారంభించి మూడేళ్లు కావస్తున్నా ఒక్క వైపే పూర్తయ్యాయి. కాంట్రాక్ట్ అగ్రిమెంట్‌కు మరో ఆరు నెలలే గడువు మిగిలి ఉండడంతో ఆ లోపు పూర్తయ్యే పరిస్థితి కనిపించడం లేదు. రోడ్డు విస్తరణ పూర్తి కాకపోవడంతో తరచు ప్రమాదాలు జరుగుతున్నాయి. దుమ్ము, ధూళితో రోడ్డు సైడ్ గ్రామాల ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు.

రూ.20 కోట్లు మంజూరు

మోత్కూరు – రాయగిరి రోడ్డు విస్తరణలో భాగంగా భువనగిరి మండలం ముస్తాలపల్లి నుంచి ఆత్మకూరు (ఎం) మండలం పోసానికుంట వరకు రూ.20 కోట్లు మంజూరయ్యాయి. ఇందులో కేంద్రం రూ.11 కోట్లు, రాష్ట్ర ప్రభుత్వం రూ.9 కోట్లు విడుదల చేసింది. 10 మీటర్ల వెడల్పు, 17కిలో మీటర్ల మేర రోడ్డు నిర్మాణం చేపట్టవలసి ఉంది. భువనగిరి మండలం ముస్త్యాలపల్లి నుంచి మోటకొండూరు మండలం కాటేపల్లి వరకు, మోటకొండూరు మండలం ముత్తిరెడ్డిగూడెం నుంచి కొండాపురం వరకు ఒక బిట్ (రూ.10కోట్లు), కాటేపల్లి నుంచి ముత్తిరెడ్డిగూడెం వరకు, కొండాపురం నుంచి ఆత్మకూరు(ఎం) మండలం పోసానికుంట వరకు ఒక బిట్ (రూ.10కోట్లు)గా విభజించారు. పనులను సీ–5 కంపెనీకి అప్పగించారు. 2020 ఆగస్టులో పనులు ప్రారంభించిన కాంట్రాక్ట్ సంస్థ.. ఇప్పటి వరకు పూర్తి చేయలేదు.

బిల్లులు రాలేదని..

బిల్లు రావడం లేదని రాయగిరి రోడ్డు విస్తరణ పనులను కాంట్రాక్టర్ నిలిపివేశారు. రోడ్డు పనులు ప్రారంభమై 26 నెలలు గడుస్తోంది. అగ్రి మెంట్ ముగింపునకు ఆరు నెలలే గడువు ఉంది. పనులు నిలిపివేయడంతో కాంట్రాక్టర్‌కు నోటీసు అందజేయనున్నట్లు అధికారులు చెబుతున్నారు.



ఇతని పేరు ఎం.సోమేశ్వర్లు. కలెక్టరేట్‌లోని శిశు సంక్షేమ శాఖ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా పని చేస్తున్నాడు. రోజూ మోత్కూరు నుంచి ఆర్టీసీ బస్సులో వచ్చిపోతుంటాడు. గతంలో ఉదయం 9.30కు ఇంటి నుంచి బయలుదేరేవారు. ప్రస్తుతం రోడ్డు బాగలేకపోవడంతో ముప్పావు గంట ముందుగా బయలుదేరుతున్నాడు. అయినప్పటికీ ఒక్కోసారి ఆలస్యం అవుతుందని అంటున్నాడు.

రోడ్డు పరిస్థితి ఇదీ..

పోసానికుంట నుంచి రాయిపల్లి వరకు బీటీ రోడ్డు పూర్తయ్యింది. రాయిపల్లి నుంచి ముత్తిరెడ్డిగూడెం వరకు ఒక పక్క పూర్తి చేశారు. అయితే రోడ్డుపై నీళ్లు పట్టించక పోవడంతో వాహనాలు వెళ్లేటప్పుడు దుమ్ము లేస్తోంది. కొండాపురం నుంచి ముత్తిరెడ్డిగూడెం కాటేపల్లి సమీపంలో నిర్మిస్తున్న కల్వర్టు అసంపూర్తిగా వదిలేశారు. ముత్తిరెడ్డిగూడెం నుంచి కాటేపల్లి చివర వరకు అసంపూర్తిగానే ఉంది.

దుమ్ము, ధూళి

యాదాద్రి, హైదరాబాద్, మహబూబాద్, తొర్రూరు, తిరుమలగిరి, తుంగతుర్తి, ఆత్మకూరు(ఎం), మోత్కూరు, గుండాల, అడ్డగూడూరు మండలాలకు ప్రధానమైన మార్గం. నిత్యం రద్దీగా ఉంటుంది. రోడ్డు సరిగా లేకపోవడంతో ప్రయాణం నరకంగా మారింది. తరచు ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఉద్యోగులు సకాలంలో కార్యాలయాలకు చేరుకోలేకపోతున్నారు. అంతేకాకుండా రోడ్డు వెంట ఉన్న కొండాపురం, రాయిపల్లి, ఆత్మకూరు(ఎం), ముత్తిరెడ్డిగూడెం, కాటేపల్లి గ్రామాల ప్రజలు దుమ్ము, ధూళితో అస్వస్థతకు గురవుతున్నారు. అనారోగ్యంతో ఆస్పత్రి పాలవుతున్నారు. అదే విధంగా కాటేపల్లి బ్రిడ్జి అసంపూర్తిగా ఉంది.



బస్సు నడపలేకపోతున్నా



హైదరాబాద్ నుంచి అన్నారం వెళుతుంటాం. కాటేపల్లి నుంచి ఆత్మకూరు(ఎం) వరకు బస్సు నడపాలంటే చాలా కష్టంగా ఉంది. మాటిమాటికి గేర్లు మార్చాల్సి వస్తుంది. రోడ్డు బాగలేకపోవడంతో బస్సు కమాన్ పట్టీలు విరిగిపోయాయి. మరమ్మతులకు సుమారు రూ.6 వేలు ఖర్చయ్యాయి.

–ఎం.నరేష్, ఆర్టీసీ డ్రైవర్

రోలింగ్ చేసి వదిలేశారు



రోడ్డుపై కంకర పోసి రోలింగ్ చేసి వదిలేశారు. ఇప్పటి వరకు ఒక వైపే బీటీ వేశారు. పనులు ప్రారంభించి మూడు సంవత్సరాలు అవుతుంది. రోడ్డు పూర్తికాకపోవడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. పరిస్థితి చూస్తుంటే ఇప్పట్లో రోడ్డు పూర్తవడం కష్టంగానే ంది. అధికారులు ప్రత్యేక శ్రద్ధ కనబరచాలి.

–దయ్యాల కుమారస్వామి, పారుపల్లి

దుమ్ము భరించలేకపోతున్నాం



ఏళ్లు గడుస్తున్నా రోడ్డు పనులు పూర్తయితలేవు. దుమ్ము, ధూళి భరించలేకపోతున్నాం. జనం అనారోగ్యంతో ఆస్పత్రుల పాలవుతున్నారు. రోడ్డుపైకి రావాలంటే ఏ ప్రమాదం జరుగుతుందోనని భయపడుతున్నాం .రోడ్డు పక్కన ఇళ్లు ఎందుకు కట్టుకున్నామ అని బాధపడుతున్నాం.పనులు త్వరగా పూర్తి చేయాలి.

–జువ్వగాని మణెమ్మ, కాటేపల్లి

పీఈటీలు, పండిట్‌లకు పదోన్నతులొచ్చేనా?

- 317 జీఓకు సంబంధించిన ఉపాధ్యాయులకు అవకాశం
- తమకూ పదోన్నతి కల్పించాలని పీఈటీలు, భాషా పండిట్‌ల డిమాండ్
- 9,10 తరగతులకు బోధన నిలిపివేసి నిరసన



భువనగిరి : 317 జీఓకు సంబంధించిన ఉపాధ్యాయులకు పదోన్నతుల కోసం ప్రభుత్వం అవకాశం కల్పించిన నేపథ్యంలో తమకూ పదోన్నతి కల్పించాలని పీఈటీలు, భాషా పండిట్‌లు డిమాండ్ చేశారు. ఇప్పటికే ఈనెల 1నుంచి 9,10 తరగతులకు బోధన నిలిపివేశారు. ఈ నేపథ్యంలో ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ సవ్యంగా సాగుతుందా లేదా అనే అనుమానాలు తలెత్తుతున్నాయి.


భాషా పండితులు, పీఈటీలు ఇలా..

జిల్లాలో భాషా పండిట్‌లు 191, పీఈటీలు 82 మంది ఉన్నారు. వీరికి 2015లో కామన్ సర్వీస్ ప్రకారం పదోన్నతులు కల్పించారు. అనంతరం ఎస్జీటీలు తమకు కూడా అర్హతలు ఉన్నాయని పదోన్నతులు కల్పించాలని 2016లో కోర్టును ఆశ్రయించారు. దీంతో అప్పట్లో కోర్టు స్టే విధించింది. సాధారణంగా బీఈడీలో తెలుగు మెథడ్‌తో పాటు డిగ్రీలో తెలుగు చేసిన వారు గ్రేడ్–1 పండిట్‌లుగా ఉంటారు. టీపీటీ, హెచ్‌పీటీలు గ్రేడ్–2గా ఉన్నారు. గ్రేడ్ – 2 పండితులు 6,7,8 తరగతులకు, గ్రేడ్ –1 పండిట్‌లు 9,10వ తరగతులకు బోధన చేయాలి. ప్రస్తుతం గ్రేడ్ –2 భాషా పండిట్‌లను ఎస్జీటీ కేటగిరిలోకి మార్చి కేటగిరి –3లోకి కలిపారు. అప్పటి నుంచి వీరిని తెలుగు లాంగ్వేజ్ పండిట్ (ఎల్‌పీటీ), హిందీ లాంగ్వేజ్ పండిట్ (ఎల్‌పీహెచ్)గా మార్చారు. గ్రేడ్ –1 భాషా పండితుల కొరత వల్ల ఎస్జీటీ కేటగిరీలో చేర్చిన ఎల్‌పీటీ, ఎల్‌పీహెచ్‌లతో 9,10 తరగతులకు బోధన చేయిస్తున్నారు. గత 20 ఏళ్ల నుంచి అదే విధంగా విధులు నిర్వహిస్తున్నారు. వీరితో పాటు ఎస్జీటీలు కోర్టులో వేసిన పిటిషన్‌తో పీఈటీల పదోన్నతులు నిలిచిపోయాయి. ప్రస్తుతం పదోన్నతులకు తాము కూడా అర్హులమని, అవకాశం కల్పించాలని భాషా పండిట్‌లు, పీఈటీలు కోరుతున్నారు. వీరికి కోర్టు అనుకూలంగా తీర్పు ఇస్తే బదిలీల, పదోన్నతుల ప్రక్రియ మరింత అలస్యం అయ్యే అవకాశం ఉంది.

నష్టపోతున్న విద్యార్థులు

భాషా పండిట్‌లు 9,10 తరగతులకు బోధన నిలిపివేశారు. దీంతో తెలుగు, హిందీ, ఉర్దూ సబ్జెక్టుల్లో బోధన జరగక విద్యార్థులు నష్టపోతున్నారు. 10వ తరగతి విద్యార్థులకు ఏప్రిల్ 3 నుంచి వార్షిక పరీక్షలు జరగనున్నాయి. ప్రస్తుతం వీరికి ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. భాషా పండిట్‌లు బోధన నిలిపివేయడంతో ఉత్తీర్ణతపై ప్రభావం చూపే అవకాశం ఉంది.


న్యాయం చేయాలి



భాషా పండిట్‌లుగా 25 సంవత్సరాల నుంచి విధులు నిర్వహిస్తున్నా. తమకు పదోన్నతులు ఇవ్వకుండా ఎస్జీటీ ఉండి తర్వాత అర్హతలు సాధించిన వారికి ఎలా ఇస్తారు. మేము కూడా అర్హులమే. మాకు పదోన్నతులు కల్పించి న్యాయం చేయాలి.

–కందుల ఉపేందర్, రాష్ట్రీయ ఉపాధ్యాయ పండిత్ పరిషత్ జిల్లా అధ్యక్షుడు

పీఈటీలకు అర్హతలున్నాయి



పీఈటీలకు అన్ని అర్హతలున్నాయి. కామన్ సర్వీస్ ప్రకారం పదోన్నతులు కల్పించాలి. జీఓ 11,12 ప్రకారం పీఈటీలకు పదోన్నతి కల్పించవల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. పీఈటీలకు కూడా న్యాయం చేయాలి.

–ఎక్కలదేవి మల్లేశం, తెలంగాణ వ్యాయామ విద్య ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు

నెలవారం.. జనహోరం


స్వామి వారిని దర్శించుకుని మెట్లపై నుంచి కిందికి వస్తున్న భక్తులు

నాలుగో రోజూ అదే జోరు

- పెద్దగట్టుకు భారీగా తరలివచ్చిన భక్తులు
- లింగమంతుల స్వామి, చౌడమ్మ తల్లికి నైవేద్యంగా బోనం చెల్లింపు
- కేసారం తరలిన దేవరపెట్టె
- నేడు మకరతోరణం తరలింపుతో జాతర పరిసమాప్తం


పెద్దగట్టు జాతర పరిసరాల వ్యూ

సూర్యాపేట/చివ్వెంల: శ్రీ లింగమంతుల స్వామి (పెద్దగట్టు) జాతరకు నాలుగో రోజు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఆదివారం గంపల ప్రదక్షిణతో వైభవంగా ప్రారంభమైన గొల్లగట్టు జాతరలో బుధవారం భక్తిశ్రద్ధలతో నెలవారం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని యాదవ పూజారులు మున్న, మెంతబోయిన వంశస్తులు సాంప్రదాయ పద్ధతిలో చేపట్టారు. లింగమంతుల స్వామిని లక్షలాది మంది భక్తులు దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

నెలవారం ప్రత్యేకత ఇదీ..

పెద్దగట్టు లింగమంతుల స్వామి నాలుగో రోజు నెలవారం తంతును భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆల మందలు, జీవాలను పరిక్షించిన దేవతగా అవతరించిన చౌడమ్మ తల్లికి ప్రత్యేక పూజలు చేశారు. మంగళవారం చంద్రపట్నం వేసి పూజలు నిర్వహించిన నిద్రఘట్టంలో భాగంగా కేసారం గ్రామానికి చెందిన యాదవ పూజారులు బుధవారం కొత్త బోనం కుండ, గంపలో పూజా సామగ్రి, తొలి గొర్రెను తోలుకుని గట్టుకు చేరుకున్నారు. చంద్రపట్నంపై ఉన్న దేవరపెట్టె వద్ద పూజలు చేశారు. మున్న, మెంతబోయిన వంశస్తులు కొత్త కుండలో బోనాలు వండారు. లింగమంతులు, చౌడమ్మతల్లికి నైవేద్యంగా పెట్టారు. మెంతబోయిన వంశీయులు తెచ్చిన తొలిగొర్రెను పట్నంపై బలి ఇచ్చారు. ఈ తంతు జరుగుతుండగా మరో వైపు బైకాన్లు కథలు చెప్పడంతో దేవాలయం ఉద్రూతలూగింది. ఆ తర్వాత మాంసాన్ని మూడు భాగాలుగా చేసి ఒక భాగం బైకాన్లకు, మరో భాగం మున్న వంశీయులకు ఇచ్చారు. మిగిలిన భాగం మెంతబోయిన వంశీయులు వంట చేసి ప్రసాదంగా తీసుకున్నారు. అనంతరం చంద్రపట్నం వేసి సమీపంలో నాగులమ్మ పుట్టలో పోశారు. తరువాత చౌడమ్మ, లింగమంతుల స్వామి విగ్రహాలు ఉన్న దేవరపెట్టెను తీసుకుని కేసారం బాటపట్టారు. దీంతో నెలవారం పండుగ ముగిసినట్లు అధికారులు ప్రకటించారు.

తల్లిదండ్రుల చెంతకు 25మంది పిల్లలు

జాతరలో తప్పిపోయిన 25 మంది పిల్లలను శిశు సంక్షేమశాఖ, పౌరసరఫరాల సమాచార శాఖ ఆధ్వర్యంలో తల్లిదండ్రుల చెంతకు చేర్చారు. పిల్ల లు తమ దగ్గరికి రావడంతో తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయా శాఖల అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

నేడు ముగియనున్న జాతర

నాలుగు రోజులుగా లక్షలాది భక్తులు పూజలు అందుకుంటున్న పెద్దగట్టు లింగమంతుల జాతర గురువారంతో ముగియనుంది. సూర్యాపేట యాదవ బజార్‌నుంచి గట్టుకు తెచ్చిన మకరతోరణం గురువారం తిరిగి స్వస్థలానికి చేరనుంది. మకరతోరణం తీసుకెళ్లడంతో జాతర ముగుస్తుందని యాదవ కుల పూజారులు తెలిపారు.

జాతరను సందర్శించిన నాయకులు

పెద్దగట్టు జాతరను సూర్యాపేట జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ గుజ్జ దీపిక యుగేందర్, పెద్దగట్టు చైర్మన్ కోడి సైదులుయాదవ్, తండు శ్రీనివాస్‌యాదవ్, జటంగి వెంకటేశ్వర్లుయాదవ్, మాజీ చైర్మన్ వసంత సత్యనారాయణపిళ్లే, సుంకరబోయిన శ్రీనివాస్‌యాదవ్, తదితరులు స్వామివారిని దర్శించుకున్నారు.


భేరీల మోతకు నృత్యం చేస్తున్న భక్తులు

ఉదయం మందకొడిగా... సాయంత్రం కిటకిట

నాలుగు రోజులుగా సాగుతున్న జాతరలో సోమవారం మినహా మిగతా రోజుల్లో ఉదయం భక్తుల రద్దీ తక్కువగా ఉంటూ జాతర పరిసర ప్రాంతాలు వెలవెలబోతున్నాయి. మధ్యాహ్నానికి పుంజుకుని రాత్రికి భక్తులతో ఆలయ ప్రాంతాలు కిటకిట లాడుతున్నాయి. ఈ రద్దీతో జాతీయ రహదారిపై కూడా ట్రాఫిక్ స్తంభించి పోతుంది. వ్యాపారాలు కూడా సాయంత్రం బాగా సాగుతున్నాయి.


పెద్దగట్టు జాతరలో భక్తుల కోలాహలం


దేవరపెట్టె వద్ద పూజలు చేస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ గుజ్జ దీపిక తదితరులు


నాగుల పుట్ట వద్ద పూజలు చేస్తున్న భక్తులు

కంపుకొడుతున్న పెద్దగట్టు పరిసరాలు

పెద్దగట్టుతో పాటు పరిసర ప్రాంతాలు అపరిశుభ్రంగా దర్శనమిస్తున్నాయి. చెత్తాచెదారం ఎక్కడ పడితే అక్కడ వేయడంతో దుర్గంధం వస్తుండడంతో భక్తులు దుర్వాసన భరించలేక పోతున్నారు.

వ్యాపారులకు జరిమానా

జాతరలో పలువురు దుకాణాదారులు అధిక ధరకు కూల్‌డ్రింక్స్, వాటర్‌బాటిళ్లు విక్రయిస్తుండడంతో భక్తులు అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో లీగల్ మెట్రాలజీ శాఖ జిల్లా అధికారి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో తనిఖీ చేసి జరిమానా విధించారు.

ప్రసాదాలను పరిశీలించిన ఫుడ్‌సేఫ్టీ అధికారులు


ప్రసాదాల తయారీని పరిశీలిస్తున్న అధికారులు

సూర్యాపేట: శ్రీ లింగమంతులస్వామి జాతరలో భక్తులకు ఇచ్చే పులిహోర, లడ్డు ప్రసాదాలను బుధవారం ఫుడ్‌సేఫ్టీ అధికారులు పరిశీలించారు. గాఢమైన పసుపు రంగును పులిహోర, లడ్డూలో కలుపుతున్నట్లు ఫిర్యాదు రావడంతో అప్రమత్తమైన అధికారులు నమూనాలను పరిశీలన నిమిత్తం హైదరాబాద్‌కు పంపించారు. ఆహారభద్రత, తనిఖీ అధికారి కళ్యాణ్ చక్రవర్తి మాట్లాడుతూ లడ్డు, పులిహోర నమూనాలు సేకరించినట్లు తెలియజేశారు. వీరి వెంట సిద్దిపేట జిల్లా ఆహార తనిఖీ అధికారి కృష్ణమూర్తి, యాదాద్రి జిల్లా ఆహార తనిఖీ అధికారి స్వాతి, వనపర్తి జిల్లా ఆహార తనిఖీ అధికారి నీలిమ, లతీఫ్ పాల్గొన్నారు.

బాగా పనిచేశారు.. కడుపు నిండా తినండి


భోజనాలు వడ్డిస్తున్న ఎస్పీ రాజేంద్రప్రసాద్

సూర్యాపేటక్రైం: దురాజ్‌పల్లి పెద్దగట్టు జాతరలో బందోబస్తు నిర్వహిస్తున్న పోలీస్ సిబ్బందికి సుధాకర్ పీవీసీ ఆధ్వర్యంలో భోజనాలు ఏర్పాటు చేశారు. బుధవారం పోలీసు సిబ్బందికి ఎస్పీ రాజేంద్ర ప్రసాద్ స్వయంగా భోజనాలు వడ్డించారు. కార్యక్రమంలో డీఎస్పీలు నాగభూషణం, వెంకటేశ్వర్ రెడ్డి, సుధాకర్ పీవీసీ యాజమాన్యం, సీఐ సోమనారాయణ సింగ్, ఎస్సై విష్ణుమూర్తి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

భక్తులు అప్రమత్తంగా ఉండాలి: డీఎంహెచ్‌ఓ


పచ్చబొట్లు వేసే వారిని హెచ్చరిస్తున్న డీఎంహెచ్‌ఓ కోటాచలం

సూర్యాపేట: జాతర సమయంలో పచ్చబొట్లు, టాటూలు వేసే వారి పట్ల భక్తులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్యారోగ్యశాఖాధికారి డాక్టర్ కోటాచలం సూచించారు. పచ్చబొట్లు వేసే వారి వద్దకు ప్రత్యేక బృందాలను పంపించి వారు వేసే విధానాన్ని గమనించారు. పచ్చబొట్లు వేసే వారు కొత్త నీడిల్ ఉపయోగిస్తున్నారా లేదా అని భక్తులుగమనించాలని కోరారు. పాత నీడిల్‌లు వాడవద్దని హెచ్చరించారు. డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ హర్షవర్ధన్ పచ్చబొట్లు వేసే విధానాన్ని పరిశీలించారు. వీరి వెంట జిల్లా అసంక్రమిత వ్యాధుల అధికారి డాక్టర్ కళ్యాణ్ చక్రవర్తి ,భూతరాజు సైదులు తదితరులు ఉన్నారు.



చలువ పందిళ్ల కింద చల్లగా..

దైవదర్శనానికి వచ్చిన భక్తులకు చలువ పందిళ్లు చల్లని నీడనిస్తున్నాయి. గుట్టపైకి మెట్ల ద్వారా ఎండలో వచ్చిన భక్తులు పైకి రాగానే కాసేపు ఈ పందిళ్ల కింద సేద దీరి దైవ దర్శనం చేసుకుంటున్నారు. అనంతరం తమతో తెచ్చుకున్న ప్రసాదాలను ఈ ప్రాంతంలో సేదదీరుతూ ఆరగిస్తున్నారు.

చిన్నారులు జాలీగా..

జాతరలో ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్‌కు భక్తులు వేలాది సంఖ్యల్లో తరలివస్తున్నారు. మధ్యాహ్నం నుంచి క్రమక్రమంగా భక్తుల రాక పెరిగి రాత్రి వరకు ప్రదర్శన శాలలు కిక్కిరిసిపోతున్నాయి. జమున సర్కస్, రంగులరాట్నం, డ్రాగన్ రైలు, బ్రేక్ డ్యాన్స్‌లు ఎక్కువగా రద్దీతో ఉంటున్నాయి. రాత్రి వేళల్లో విద్యుత్ కాంతులతో ఎగ్జిబిషన్ సందర్శకులను ఆకట్టుకుంటున్నాయి.


కారులో షికారు చేస్తున్న చిన్నారులు

15 వరకు 'నవోదయ' గడువు పెంపు

పెద్దవూర: మండలంలోని చలకుర్తి క్యాంపు జవహర్ నవోదయ విద్యాలయంలో 2023–24 విద్యా సంవత్సరానికి ఆరో తరగతిలో ప్రవేశాలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవటానికి గడువును ఫిబ్రవరి 15వ తేదీ వరకు పొడిగించినట్లు ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ స్వర్ణలత ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇప్పటివరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోని ఆరో తరగతి విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ నెల 16, 17 తేదీల్లో ఆన్‌లైన్‌లో తప్పులు సరిచేసుకోవటానికి వెబ్‌సైట్ ఓపెన్ అవుతుందని తెలిపారు. జెండర్(మేల్/ఫీమేల్), కేటగిరీ(జనరల్/ఓబీసీ/ఎస్సీ/ఎస్టీ), ప్రాంతం(అర్బన్/రూరల్), డిజేబిలిటీ, ప్రవేశ పరీక్ష రాసే మాధ్యమంను మాత్రమే మార్చేందుకు అనుమతిచ్చినట్లు తెలిపారు.

'అనురాగ్'లో రాష్ట్ర స్థాయి స్పోర్ట్స్ మీట్


మైదానాలను సిద్ధం చేస్తున్న సిబ్బంది

అనంతగిరి: తెలంగాణ ప్రభుత్వం నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి ఆరో ఇంటర్ పాలిటెక్నిక్ గేమ్స్ అండ్ స్పోర్ట్స్ మీట్‌ను స్థానిక అనురాగ్ ఇంజనీరింగ్ కళాశాలలో గురువారం ప్రారంభంకానున్నట్లు ప్రిన్సిపాల్ డా. ఎంవీ శివప్రసాదరావు తెలిపారు. బుధవారం ఆయన కళాశాలలో మాట్లాడుతూ.. నల్లగొండ, ఖమ్మం, కరీంనగర్, మహబూబ్‌నగర్, మేడ్చల్, సిద్దిపేట, రంగారెడ్డి, మెదక్, వరంగల్ జిల్లాల నుంచి 1250మంది క్రీడాకారులు ఈ స్పోర్ట్స్ మీట్‌లో పాల్గొననున్నట్లు తెలిపారు. బుధవారం సాయంత్రానికే క్రీడాకారులు అనురాగ్ ఇంజనీరింగ్ కళాశాలకు చేరుకున్నారని, క్రీడాకారులకు అవసరమైన అన్ని వసతులతో పాటు కోర్టులను సిద్ధం చేశామన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా టెక్నికల్ ఎడ్యుకేషన్ ఆర్‌జేడీ ఏ. పుల్లయ్య, డా. శ్రీనాథ్, ఎమ్మెల్సీ, అనురాగ్ కళాశాల కరస్పాండెంట్ డా. పల్లా రాజేశ్వరరెడ్డి హాజరుకానున్నట్లు పేర్కొన్నారు.

రైతుల కోసమే గోదాంల నిర్మాణం


గోదామును పరిశీలిస్తున్న నాబార్డు ఈఈ గోపాల్‌రావు తదితరులు

త్రిపురారం: రైతుల కోసం గ్రామాల్లో పీఏసీఎస్ కేంద్రాల వద్ద నాబార్డు సహకారంతో గోదాంలను నిర్మిస్తున్నామని నాబార్డు రాష్ట్ర ఈఈ గోపాల్‌రావు అన్నారు. త్రిపురారం మండలంలోని పెద్దదేవులపల్లి గ్రామంలో సుమారు రూ.33లక్షల నాబార్డు ఆర్థిక సహకారంతో పీఏసీఎస్ ఆధ్వర్యంలో నిర్మిస్తున్న నూతన గోదాంను బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పీఏసీఎస్‌లు రైతులకు ఉత్తమ సేవలు అందిస్తూ, వ్యాపారాన్ని అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పెద్దదేవులపల్లి పీఏసీఎస్ చైర్మన్ మందడి నాగేందర్‌రెడ్డి, నాబార్డు ఏఈ చంద్రశేఖర్, బీడీఓ మణికాంత్, నోడల్ అధికారి సుగుణ, సివిల్ ఇంజనీర్ సీతారామరెడ్డి, సీఈఓ గోవర్ధన్, సైదులు, విష్ణు పాల్గొన్నారు.

బుద్ధవనం సందర్శించిన అటవీశాఖ రీజనల్ డైరెక్టర్


బుద్ధుడి విగ్రహం వద్ద అటవీశాఖ రీజనల్ డైరెక్టర్ త్రినాథ్‌రావు తదితరులు

నాగార్జునసాగర్: అటవీశాఖ రీజనల్ డైరెక్టర్ త్రినాథ్‌రావు బుధవారం నాగార్జునసాగర్‌లోని బుద్ధవనాన్ని సందర్శించారు. అమ్రాబాద్ ఫారెస్ట్ రిజర్వ్ పరిధిలో శాఖాపరమైన తనిఖీల్లో భాగంగా ఆయన సాగర్ అటవీ ప్రాంతంలో పలు అభివృద్ధి కార్యక్రమాలను పరిశీలిస్తూ బుద్ధచరితవనం, ధ్యానవనం, స్థూపవనం, మహాస్థూపాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బుద్ధవనం అద్భుతమైన నిర్మాణమని పేర్కొన్నారు. వీరికి గౌడ్ సత్యనారాయణ బుద్ధవనం చారిత్రక ప్రాధాన్యత గురించి వివరించారు. కార్యక్రమంలో జిల్లా అటవీశాఖ అధికారి రాంబాబు, నాగార్జునసాగర్ ఎఫ్‌డీఓ సర్వేశ్వర్, స్థానిక అటవీ శాఖ అధికారి రమేశ్ పాల్గొన్నారు.

ప్రసాదం కాంప్లెక్స్ మెట్ల మార్గంలో షెడ్డు నిర్మాణం

యాదగిరిగుట్ట: యాదాద్రి లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకునేందుకు వచ్చే భక్తులు ఎక్కువగా కొండపైన కొలువైన శ్రీపర్వతవర్ధిని సమేత రామలింగేశ్వరస్వామి వారిని దర్శించుకుంటున్నారు. అంతేకాకుండా శివాలయం చెంతనే ఉన్న ప్రసాదం విక్రయశాలకు వెళ్లి ప్రసాదం కొనుగోలు చేసి మెట్ల మార్గంలో బస్‌బే వద్దకు వెళ్తుంటారు. ఈ మార్గంలో ఎటువంటి నీడ లేకపోవడంతో పాటు మండుటెండకు కృష్ణశిల స్టోన్ ఫ్లోరింగ్‌పై వెళ్లే భక్తులకు కాళ్లు కాలుతున్నాయి. దీనిని గమనించిన అధికారులు ప్రసాద కాంప్లెక్స్‌కు అనుకొని ఉన్న మెట్ల మార్గంలో రేకులతో షెడ్డును ఏర్పాటు చేస్తున్నారు. ఇందుకు సంబంధించిన పనులను సిబ్బంది వేగంగా చేస్తున్నారు. వేసవిలో భక్తులకు ఈ మెట్ల మార్గంలో సేద తీరేందుకు సైతం వీలు ఉంటుందని భావించిన ఆలయ అధికారులు ఈ షెడ్డు నిర్మాణాన్ని వేగంగా చేస్తున్నారు.

మోడలింగ్ షోకి గౌరవ అతిథిగా మూసాఅలీఖాన్


మూసాఅలీఖాన్

మిర్యాలగూడ టౌన్: హైదరాబాద్‌లోని బంజారాహిల్స్‌లో గల తాజ్ బంజారా హోటల్‌లో ఈ నెల 12న జరగనున్న రిఫ్విడ్ మోడలింగ్ షోకి గౌరవ అతిథిగా మిర్యాలగూడ పట్టణానికి చెందిన సినీ నటుడు, సామాజిక సేవకుడు, నిర్మాత మూసాఅలీఖాన్ హాజరుకానున్నారు. ఈ మేరకు మోడలింగ్ షో నిర్వాహకులు సయ్యద్ అమీర్, పూజా గుప్తా నుంచి బుధవారం మూసాఅలీఖాన్‌కు ప్రత్యేక ఆహ్వానం అందింది.

ఊపందుకున్న ఘాట్ రోడ్డు విస్తరణ పనులు


మొదటి ఘాట్ రోడ్డులో పనులు చేస్తున్న కూలీలు

యాదగిరిగుట్ట: యాదాద్రి లక్ష్మీనరసింహస్వామి కొండపైకి వెళ్లే మొదటి ఘాట్ రోడ్డు గతేడాది కురిసిన వర్షాలకు కుంగిపోయింది. దీంతో అధికారులు ఘాట్ రోడ్డును వెడల్పు చేయడంతో పాటు మరమ్మతులు చేపట్టారు. సుమారు రూ.4కోట్లతో 7 మీటర్లు ఉన్న ఘాట్ రోడ్డును 12 మీటర్ల వెడల్పుకు పెంచుతున్నారు. ఈ నెల 21వ తేదీ నుంచి యాదాద్రి బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో రోడ్డు విస్తరణ పనులు ఊపందుకున్నాయి. ఆర్‌అండ్‌బీ అధికారులు ఈ పనులను దగ్గరుండి చేయిస్తున్నారు. ఈ నెల చివరి వరకు పనులను పూర్తిచేసి మొదటి ఘాట్ రోడ్డును అందుబాటులోకి తీసుకురానున్నారు. ప్రస్తుతం మూడవ ఘాట్ రోడ్డు గుండా వాహనాలు కొండపైకి రాకపోకలు సాగిస్తున్నాయి.

వ్రత మండపం వద్ద వాహన పూజలు


వ్రత మండపం పక్కన ఏర్పాటు చేసిన షెడ్డులో వాహన పూజలు చేస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట: నూతన వాహనాలు కొనుగోలు చేసిన యాజమానులు ఎక్కువగా యాదాద్రీశుడి చెంత పూజలు చేయించడం సంప్రదాయంగా వస్తుంది. భక్తుల సౌకర్యార్థం వాహన పూజల షెడ్డును శ్రీసత్యనారాయణస్వామి వ్రత మండపం వద్ద ఏర్పాటు చేసి, భక్తులకు అందుబాటులోకి తీసుకువచ్చారు. ఆలయాభివృద్ధి ముందు మొదటి ఘాట్ రోడ్డులో ఈ వాహన పూజల షెడ్డు ఉండేది. ఘాట్ రోడ్డుతో పాటు కొండ చుట్టూ గ్రీనరీ పనులు చేపట్టడంతో ఈ షెడ్డును పాత గోశాలలోకి మార్చారు. అక్కడే వ్రత మండపం సైతం ఉండేది. ఇటీవలే శ్రీసత్యనారాయణస్వామి వ్రత మండపాన్ని పూర్తిచేసి దానిని అందుబాటులో తీసుకురావడంతో భక్తుల సౌకర్యార్థం వ్రత మండపం పక్కనే వాహనాల పూజల కోసం షెడ్డును ఏర్పాటు చేసి వినియోగిస్తున్నారు. ఇక్కడ వాహన పూజలు చేసుకున్న భక్తులు నేరుగా మూడవ ఘాట్ రోడ్డు నుంచి యాదాద్రి కొండపైకి వెళ్లనున్నారు.

మద్యం తాగేందుకు వచ్చి.. మురుగు గుంటలో శవమై..

- అనుమానాస్పద స్థితిలో యువకుడు మృతి
- మఠంపల్లిలో వెలుగుచూసిన ఘటన
- మృతుడు ఆంధ్రా ప్రాంత వాసి

మఠంపల్లి: అదృశ్యమైన యవకుడు మురుగు గుంటలో శవమై తేలాడు. సూర్యాపేట జిల్లా మఠంపల్లి మండల కేంద్రంలో బుధవారం వెలుగులోకి వచ్చిన ఈ ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం పల్నాడు జిల్లా దాచేపల్లి మండలం సారంగపల్లి గ్రామానికి చెందిన గల్లా నతానియేల్ (26) స్నేహితులతో కలిసి తరచూ మద్యం సేవించేందుకు మంఠంపల్లి మండల కేంద్రానికి వచ్చి పోతుంటాడు. ఈ నేపథ్యంలోనే నతానియేల్ ఈ నెల 6వ తేదీన ఇద్దరు స్నేహితులతో కలిసి మఠంపల్లిలోని ప్రధాన రహదారి పక్కన గల పంజాబీ దాబాకు వచ్చారు. అక్కడ మద్యం సేవించిన తర్వాత ఇద్దరు స్నేహితులు స్వస్థలానికి వెళ్లిపోగా నతానియేల్ ఇంటికి వెళ్లలేదు. దీంతో మరుసటి రోజు (7వ తేదీన) అతడి తండ్రి ప్రసాదరావు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా అదృశ్యం కేసు నమోదైంది. అయితే, బుధవారం ఉదయం స్థానికులు మురుగు గుంటలో తేలిన మృతదేహాన్ని గమనించి పోలీసులకు సమాచారం ఇవ్వడంతో విషయం వెలుగులోకి వచ్చింది. సమాచారం మేరకు ప్రసాదరావు, ఇతర కుటుంబ సభ్యులు వచ్చి మృతుడు నతినియేల్ అని గుర్తుపట్టారు. హత్య చేసి మురుగు గుంటలో పడవేశారని, నిందితులను కఠినంగా శిక్షించాలని కొద్ది సేపు పోలీస్‌స్టేషన్ ఎదుట ఆందోళన నిర్వహించారు. కాగా, పోలీసులు మృతదేహాన్ని వెలికి తీయించి పోస్టుమార్టం నిమిత్తం హుజూర్‌నగర్ ఆస్పత్రికి తరలించారు. అయితే, మఠంపల్లికి నతానియేల్‌తో పాటు వచ్చిన ఇద్దరు స్నేహితులను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు తెలిసింది. ప్రసాదరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు మఠంపల్లి ఎస్‌ఐ ఇరుగు రవి తెలిపారు.